సాక్షి
సూర్యాపేట
గురువారం । 19 । జనవరి । 2023



అప్పల రాష్ట్రంగా మార్చారు
తెలంగాణను కేసీఆర్ అప్పుల రాష్ట్రంగా మార్చారని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు. - 8లో



పోలీసు బందోబస్తు పరిశీలన
జాతీయ రహదారిపై రాయినిగూడెం జంక్షన్ వద్ద పోలీసు బందోబస్తును ఎస్పీ రాజేంద్రప్రసాద్ పరిశీలించారు. - 8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 30.0°/18°
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఆహ్లాదంగా, రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

20న జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

సూర్యాపేటటౌన్ : జిల్లా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 20న 1వ, 7వ స్థాయీ సంఘాల సమావేశాలు, 2, 4వ స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహిస్తున్నట్టు జెడ్పీ సీఈఓ సురేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్ పర్సన్ గుజ్జా దీపిక అధ్యక్షత ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. జిల్లా అధికారులు, సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

పశు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



మందులు పంపిణీ చేస్తున్న జిల్లా పశువైద్యాధికారి శ్రీనివాసరావు

కోదాడరూరల్ : జిల్లా వ్యాప్తంగా ఉచిత పశు వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు కోరారు. బుధవారం మండల పరిధిలోని కాపుగల్లులో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య, గర్భ కోశ వ్యాధుల చికిత్సా శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పాడి రైతులు పశువుల్లో వచ్చే వ్యాధులను గమనిస్తూ వెంటనే సంబంధిత వైద్య సిబ్బంది సహకారంతో నివారణ చర్యలు చేపట్టాలన్నారు. సబ్సిడీపై వచ్చే గడ్డి విత్తనాలు సాగు చేసుకొని పశుగ్రాస కొరతను అధిగమించాలన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ నాగేంద్రబాబు, డాక్టర్ వీరారెడ్డి, సిబ్బంది సాయి, నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

మన ఊరు- మనబడి పనులు పూర్తి చేయాలి



హుజూర్‌నగర్‌రూరల్ : ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ అశోక్

హుజూర్‌నగర్‌రూరల్ : మన ఊరు– మనబడి పథకంలో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.అశోక్ ప్రధానోపాధ్యాయులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని లింగగిరి ఎస్సీ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాల, హుజూర్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మన ఊరు– మనబడి కింద చేపట్టిన పనులను పర్యవేక్షించారు. ఏఈ, కాంట్రాక్టర్లకు తగిన సలహాలు, సూచనలు చేశారు. అనంతరం పదవ తరగతి పరీక్షా ఫలితాలపై ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం సబ్జెక్టుల వారీగా పదో తరగతిలో విద్యార్థుల ప్రతిభను తెలుసుకొని 100 శాతం విద్యార్థులు పాస్ అయ్యేలా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి భూక్యా సైదానాయక్, హెచ్‌ఎం మల్లెల ఉదయశ్రీ,, ఉపాధ్యాయులు సాముల వెంకటరెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్‌రావు, ఉపేందర్, వసంతరావు, సీఆర్‌పీ సైదులు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన

హుజూర్‌నగర్(చింతలపాలెం): చింతలపాలెం, చింత్రియాల గ్రామాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు మన బడి పథకంలో భాగంగా చేపట్టిన పనులను డీఈఓ అశోక్ బుధవారం పరిశీలించారు. అలాగే చింతలపాలెం, కిష్టాపురంలలో కంటి వెలుగు ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓ సైదానాయక్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులున్నారు.

నేడు సీపీఎం నేత కాంతారెడ్డి సంస్మరణ సభ

మునగాల: సీపీఎం సీనియర్ నాయకుడు, జిల్లా రైతు సంఘం నాయకుడు ఉప్పుల కాంతారెడ్డి సంస్మరణ సభ గురువారం మండల కేంద్రంలోని నల్లపాటి నాగేశ్వరరావు రైస్‌మిల్లులో నిర్వహిస్తున్నట్టు పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు దేవరం వెంకటరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి, పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డితో పాటు జిల్లా పార్టీ నాయకులు, మండల పార్టీ నాయకులు హాజరవుతున్నట్లు వివరించారు. ఈ సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఇదే.. నవ యాదాద్రి

ప్రధానాలయ విశిష్టతను రెండు రాష్ట్రాల సీఎంలకు వివరించిన కేసీఆర్

- ఖమ్మం సభకు వెళ్తూ యాదాద్రీశుడిని దర్శించుకున్న సీఎంలు కేసీఆర్, కేజ్రీవాల్, భగవంత్ సింగ్ మాన్
- సీఎంలతో వచ్చిన ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్
- గంట 40 నిమిషాల పాటు సాగిన పర్యటన



ఆలయ తిరువీధుల్లో సీఎంలు కేసీఆర్, కేజ్రీవాల్, భగవంత్‌సింగ్ మాన్, యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్, రాష్ట్ర మంత్రులు తలసాని, ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత, ఈఓ గీతారెడ్డి, కలెక్టర్ తదితరులు

యాదగిరిగుట్ట : గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రంగా రూపుదిద్దుకున్న యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్ సింగ్ మాన్, ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ దర్శించుకున్నారు. శ్రీస్వామివారి ఆశీస్సులు అందుకుని యాదాద్రి ఆలయ పునః నిర్మాణ విశేషాలను తెలుసుకున్నారు. ఆధ్యాత్మిక క్షేత్రంగా రూపుదిద్దుకుంటున్న తీరు, ఆలయానికి భక్తులు వస్తున్న అంశాలను సీఎం కేసీఆర్ వారికి వెల్లడించారు. గోపురాల విశేషాలు వివరించి.. స్వయంభూ, ముఖ మండపం, అద్దాల మండపం, వేంచేపు మండపం, శివాలయం వంటి ప్రాంతాలకు సీఎంలను తీసుకెళ్లారు. ముఖ్యమంత్రులు, జాతీయ నేతలు గంటా 40 నిమిషాల పాటు యాదాద్రి పరిసరాల్లో గడిపారు.

ముఖ్యమంత్రుల పర్యటన సాగిందిలా..

- → ఉదయం 11.11గంటలకు ఒక హెలికాప్టర్, 11.13 నిమిషాలకు మరో హెలికాప్టర్ యాదాద్రికి చేరుకున్నాయి.
- → 11.16 గంటలకు యాగ స్థలంలో హెలికాప్టర్లు ల్యాండింగ్ అయ్యాయి. వాటిలో సీఎం కేసీఆర్, కేరళ, ఢిల్లీ, పంజాబ్ సీఎంలు పినరయి విజయన్, అరవింద్ కేజ్రీవాల్, భగవంత్ సింగ్ మాన్, మాజీ సీఎం అఖిలేష్‌యాదవ్, సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా, ఎమ్మెల్సీ కవిత, రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్, మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, ప్రశాంత్ రెడ్డి వచ్చారు.
- → 11.18గంటలకు వీరికి కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ దేవేంద్రసింగ్ చౌహాన్, జాయింట్ కలెక్టర్ దీపక్ తివారీ, డీసీపీ నారాయణరెడ్డి స్వాగతం పలికారు.
- → 11.22 గంటలకు యాగ స్థలం నుంచి ప్రెసిడెన్షియల్ సూట్‌కు సీఎంలు, మంత్రులు ప్రత్యేక కాన్వాయ్‌లో వెళ్లారు.
- → 11.26కు ప్రెసిడెన్షియల్ సూట్‌కు చేరుకున్నారు. కేరళ సీఎం పినరయి విజయన్, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రెసిడెన్షియల్ సూట్‌లో ఉండగా.. 11.32కు ముఖ్యమంత్రులు కేసీఆర్, అరవింద్ కేజ్రీవాల్, భగవంత్ సింగ్ మాన్, మాజీ సీఎం అఖిలేష్ యాదవ్‌కు ప్రెసిడెన్షియల్ సూట్ నుంచి బయల్దేరి 11.37కు కొండపైకి చేరుకున్నారు.
- → 11.38గంటలకు ఉత్తర దిశలో వారికి ప్రభుత్వ విప్ గొంగిడి సునితామహేందర్‌రెడ్డి బొట్టు పెట్టి ఆహ్వానించారు. అక్కడే దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఈఓ గీతారెడ్డి, అర్చకులు స్వాగతం పలికారు.
- → 11.41కి తూర్పు రాజగోపురం వద్ద ఆచార్యులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. 11.43కి ఆలయంలో క్షేత్రపాలకుడిని దర్శించుకున్నారు.



ధ్వజస్తంభానికి మొక్కుతున్న సీఎం కేసీఆర్ పక్కన కేజ్రీవాల్, అఖిలేష్‌యాదవ్

- → 11.44కు ముఖ మండపంలో అతిథులు ధ్వజస్తంభాన్ని మొక్కారు. 11.45కి ముఖ మండపంలో నిర్మాణాలను సీఎం కేసీఆర్ ఢిల్లీ, పంజాబ్ సీఎంలు కేజ్రీవాల్, భగవంత్ సింగ్ మాన్, మాజీ సీఎం అఖిలేష్‌యాదవ్‌కు వివరిస్తూ గర్భాలయం వద్దకు చేరుకున్నారు.
- → 11.45 గంటలకు సీఎంలు కేసీఆర్, కేజ్రీవాల్, భగవంత్ సింగ్ మాన్, మాజీ సీఎం అఖిలేష్ యాదవ్‌తో పాటు రాష్ట్ర మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి తదితరులు గర్భాలయంలోకి వెళ్లారు. స్వయంభూ, ప్రతిష్టా అలంకార మూర్తులను దర్శించుకొని, 10 నిమిషాల పాటు ప్రత్యేక పూజలు చేశారు.
- → 11.57కి సీఎంలు కేసీఆర్, కేజ్రీవాల్, భగవంత్ సింగ్‌మాన్, మాజీ సీఎం అఖిలేష్‌యాదవ్‌కు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేశారు.
- → మధ్యాహ్నం 12గంటలకు ఆశీర్వచనం పూర్తి కాగానే, సీఎంలకు దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఈఓ గీతారెడ్డి లడ్డూ ప్రసాదంతో పాటు శ్రీస్వామి వారి చిత్రాలను అందజేశారు.
- → 12.02కి ముఖ మండపం నుంచి ప్రథమ ప్రాకారంలోని అద్దాల మండపానికి చేరుకున్నారు.
- → 12.03 గంటలకు అద్దాల మండపంలో అమ్మవారిని దర్శించుకొని, అక్కడే ఏర్పాటు చేసిన యాదాద్రి ప్రధానాలయ పునఃనిర్మాణ ఫొటో ఎగ్జిబిషన్ తిలకించారు. అనంతరం విజిటర్ పుస్తకంలో సీఎంలు, మాజీ సీఎంలు సంతకాలు చేశారు. దేవస్థానం తరపున తయారు చేసిన లడ్డూ, పులిహోర, సిర వంటి ప్రసాదాన్ని స్వీకరించారు.
- → 12.10కి పడమటి రాజగోపురం నుంచి ఉత్తర తిరువీధి గుండా ఆలయాన్ని పరిశీలించి, కొండపైనే ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి వారిని దర్శించుకునేందుకు వెళ్లారు.
- → 12.15కి శివాలయంలో మహా శివుడిని దర్శించుకున్నారు.
- → 12.19కి కొండపై నుంచి బయల్దేరి తిరిగి 12.26 గంటలకు ప్రెసిడెన్షియల్ సూట్‌కు చేరుకున్నారు.
- → 12.40కి ప్రెసిడెన్షియల్ సూట్ నుంచి బయల్దేరి యాగ స్థలంలోని హెలిపాడ్ వద్దకు చేరుకున్నారు.
- → 12.43కు ఒక హెలికాప్టర్‌లో సీఎంలు కేసీఆర్, విజయన్, మరో హెలికాప్టర్‌లో ఆప్ సీఎంలు అరవింద్ కేజ్రీవాల్, భగవంత్ సింగ్ మాన్, మంత్రులు ఎక్కారు.
- → 12.51కి ఆయా రాష్ట్రాల సీఎంలు ఖమ్మంకు బయల్దేరారు.



ముఖ్యమంత్రులకు ఆశీర్వచనం చేస్తున్న ఆచార్యులు



ఆలయ విశిష్టతను ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు వివరిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

కాన్వాయ్ పక్కన పెట్టి.. కార్యకర్తలతో కలిసి..

- డీసీఎంలో ఖమ్మం బీఆర్‌ఎస్ సభకు వెళ్లిన మంత్రి జగదీశ్‌రెడ్డి
- తొమ్మిదేళ్లలో బీజేపీతో ఒరిగిందేమీలేదని విమర్శ



కార్యకర్తలతో కలిసి నినాదాలు చేస్తున్న మంత్రి

సూర్యాపేట రూరల్: విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి తన కాన్వాయ్‌ని పక్కన పెట్టి కార్యకర్తలతో కలిసి డీసీఎంలో బుధవారం ఖమ్మంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ సభకు తరలివెళ్లారు. మొదట మంత్రి జగదీశ్‌రెడ్డి సోలిపురంలో లారీ ఎక్కి కొంతదూరం వరకు వెళ్లి కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. చందుపట్లకు చేరుకున్న తర్వాత డీసీఎంలో కూర్చొని ఖమ్మం చేరుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2014 కు ముందు రామరాజ్యం అని చెప్పిన బీజేపీ 9ఏళ్లుగా చేసేది రాక్షస పాలన అని ఆరోపించారు. బీజేపీకి ప్రజలు రాం రాం చెప్పబోయే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. ఖమ్మం బీఆర్‌ఎస్ సభతో దేశంలో రాజకీయంగా పెను మార్పులు తథ్యమని జోస్యం చెప్పారు. బీజేపీ పాలనలో దేశం లో ఆకలి కేకలు మినహా ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. తెలంగాణలో కేసీఆర్ చేసిన అభివృద్ధి నమూనాను యావత్ భారతావని కోరుకుంటోందన్నారు. అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపించిన నాయకుడు కేసీఆర్ అని అన్నారు.

బడికి పోదాం రండి

- కొనసాగుతున్న బడి బయటి పిల్లల గుర్తింపు సర్వే
- ఇప్పటి వరకు 42 మంది గుర్తింపు
- స్కూల్‌లో చేర్పించేలా తల్లిదండ్రులకు కౌన్సిలింగ్
- రేపటి వరకు కొనసాగింపు



కోమటిపల్లి గ్రామంలోని జంగాలకాలనీలో వివరాలు సేకరిస్తున్న సీఆర్‌పీ వెంకట్‌రెడ్డి

చదువుకునేలా ప్రోత్సహిస్తున్నాం



బడి బయట పిల్లల కోసం జిల్లా వ్యాప్తంగా సీఆర్‌పీలతో సర్వే చేపట్టాం. మధ్యలో బడి మానేసిన, బడికి వెళ్లని వారి వివరాలను సేకరిస్తున్నారు. ఇప్పటి వరకు 42 మందిని గుర్తించాం. ఈనెల 20 వరకు సర్వే జరిపి ఆ తర్వాత ప్రబంధ్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేసి వారిని పాఠశాలల్లో చేర్పిస్తాం.
– దేవరశెట్టి జనార్దన్, జిల్లా సెక్టోరియల్ అధికారి

అర్వపల్లి: బాలకార్మిక వ్యవస్థను రూపుమాపి, బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలల్లో చేర్పించడానికి విద్యాశాఖ అధికారులు సర్వే చేస్తున్నారు. ఇందులో సీఆర్‌పీలు కాంప్లెక్స్‌ల వారీగా గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ బడికి వెళ్లని, స్కూల్ మధ్యలో మానేసిన వారి వివరాలు సేకరిస్తున్నారు. జిల్లాలో ఈనెల 5న ప్రారంభమైన ఈ సర్వే 20వ తేదీ వరకు కొనసాగనుంది. 6 నుంచి 14 ఏళ్ల, 15 నుంచి 19 ఏళ్ల వయస్సు ఉన్నవారి జాబితాలను వేర్వేరుగా రూపొందిస్తున్నారు. అలాగే ప్రత్యేక అవసరాలు కలిగిన (దివ్యాంగులు) వారి సర్వేను ఐఈఆర్‌పీలు చేస్తున్నారు.

సర్వే పర్యవేక్షణ

జిల్లాలో 718 ప్రాథమిక, 179 ప్రాథమికోన్నత, 244 జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటి పరిధిలో 71,815 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇప్పటి వరకు నిర్వహించిన ఇంటింటి సర్వేలో 42 మంది విద్యార్థులు బడిబయట ఉన్నట్లు గుర్తించారు. వీరిని పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సీఆర్‌పీలు కౌన్సిలింగ్ ఇస్తున్నారు. సర్వేను ఎప్పటికప్పుడు కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, ఎంఈఓలు, సెక్టోరియల్ అధికారి పర్యవేక్షిస్తున్నారు. సర్వే పూర్తయ్యాక బడి బయట ఉన్న పిల్లల జాబితాను రూపొందించి కలెక్టర్‌కు అందజేసి కేంద్ర ప్రభుత్వ ప్రబంధ్ పోర్టల్‌లో నమోదు చేయనున్నారు.

జీవిత భాగస్వామికి ఆసరా

- వృద్ధాప్య పింఛన్ పొందుతున్న భర్త మరణిస్తే భార్యకు మంజూరు
- పక్షం రోజుల్లోనే ప్రక్రియ పూర్తి చేయాలని నిర్ణయం
- గ్రామీణాభివృద్ధిశాఖ నుంచి ఉత్తర్వులు
- 1,500 మందికి ప్రయోజనం



జిల్లాలో ఉన్న పింఛన్ లబ్ధిదారులు

వృద్ధాప్య	38,313
వికలాంగుల	18,552
వితంతు	51,672
చేనేత	862
కల్లు గీత కార్మికుల	6542
ఒంటరి మహిళల	6545
మొత్తం	1,22,486



ఈ ఫొటోలో కన్పిస్తున్న మహిళ చిలుకూరు గ్రామానికి చెందిన కొండా నర్సమ్మ. ఈమె భర్త కొండా ముత్తిలింగం. ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఇతనికి వృద్ధాప్య పింఛన్ వచ్చేది. అయితే ప్రస్తుతం వితంతు పెన్షన్‌కు అర్హురాలు. ఏడాది కాలంగా పలు మార్లు మీ సేవ కేంద్రానికి వెళ్లి పింఛన్ కోసం ఆన్‌లైన్ చేయించుకుంది. అధికారుల చుట్టూ తిరిగుతున్నా కనికరించలేదు. ఇలాంటి వారికి ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో లబ్ధిచేకూరనుంది.

చిలుకూరు: వృద్ధాప్య పింఛన్ పొందుతున్న భర్తలు చనిపోయిన వారి భార్యలు ఆసరా కోసం ఎదురుచూస్తున్నారు. పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుని ఏళ్లు గడుస్తున్నా అతీగతీ లేదు. వీరికి ప్రభుత్వం సంక్రాంతి పండుగ రోజు శుభవార్త చెప్పింది. వృద్ధాప్య పింఛన్‌దారుడు మరణిస్తే భాగస్వామికి పక్షం రోజుల్లో పెన్షన్ మంజూరు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు గ్రామీణ అభివృద్ధిశాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

23 మండలాల పరిధిలో..

జిల్లాలో 23 మండలాల పరిధిలో భర్తలు మరణించి పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు 1,500 మంది ఉన్నారు. వృద్ధాప్య పింఛన్‌దారుడు మరణిస్తే జీవిత భాగస్వామి తన ఆధార్‌కార్డుతో పాటు చని పోయిన వ్యక్తి మరణ ధ్రువీకరణ పత్రాన్ని జత చేసి గ్రామ పంచాయతీ కార్యదర్శికి అందజేయాలి. అదే పట్టణాల్లో అయితే బిల్ కలెక్టర్‌కు అప్పగించాలి. ఈ పత్రాలు స్వీకరించిన అధికారులు మండల స్థాయిలో అయితే వీటిని వెంటనే ఎంపీడీఓ, పట్టణాల్లో అయితే మున్సిపల్ కమిషనర్ పంపించాలి. వీరి పరిశీలన అనంతరం జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి లేదా కలెక్టర్ ఆమోదం కోసం పంపించాలి. వీటి కోసం ఇప్పటికే ఆసరా పోర్టల్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేసిట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ ప్రక్రియనంతా 15 రోజుల లోపు పూర్తి చేయాల్సి ఉంటుంది. అంటే దరఖాస్తు చేసుకున్న వారికి పక్షం రోజుల్లోగా పింఛన్ మంజూరు అవుతుంది. ఈ నిర్ణయంతో గ్రామాల్లోని వృద్ధులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. భాగస్వాములు మృతి చెంది ఏళ్లు గడుస్తున్నా ఇంత వరకు పింఛన్ మంజూరు కాక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం హర్షణీయమంటున్నారు.

నెలకు వివిధ పింఛన్ల కింద రూ.30,12,17,984 పంపిణీ

ఆసరా పథకం ద్వారా వృద్ధాప్య, చేనేత, వితంతు, కల్లుగీత కార్మికులు, ఒంటరి మహిళలకు నెలకు రూ. 2,016 చొప్పున, వికలాంగులకు రూ. 3016 చొప్పున మొత్తం 1, 22,486 మంది లబ్ధిదారులకు నెలకు జిల్లా వ్యాప్తంగా రూ. 30,12, 17 ,984 పంపిణీ చేస్తున్నారు.

ఇంకా ఉత్తర్వులు అందలేదు



భాగస్వామికి ఆసరా పింఛన్‌పై నేటి వరకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. ఉత్తర్వులు రాగానే వెంటనే నిబంధనల ప్రకారం అర్హత కలిగిన భాగస్వాములకు పింఛన్ మంజూరుకు కృషి చేస్తాం. ఇప్పటికే చాలా మంది దరఖాస్తు చేస్తున్నారు. ఉత్తర్వులు రాగానే వాటని పరిశీలిస్తాం.
– కనపర్తి ఈదయ్య, ఎంపీడీఓ , చిలుకూరు

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో బుధవారం శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రాతఃకాలార్చన, సుప్రభాతసేవ, నిత్యాగ్నిహోత్రి, ప్రత్యేక అర్చనలు జరిపించారు. అనంతరం అష్టోత్తర సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. అదేవిధంగా నూతన పట్టు వస్త్రాలంకరణతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం నిర్వహించారు. అనంతరం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరనం, మధుపర్క పూజ, మాంగల్యధారణ జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ఛైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

50 బృందాలు.. వంద రోజులు

- నేటి నుంచి కంటి వెలుగు వైద్య శిబిరాలు
- ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహణ
- అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు
- కుడకుడలో లాంఛనంగా ప్రారంభించనున్న మంత్రి జగదీశ్‌రెడ్డి



సూర్యాపేట పట్టణంలోని ఎంఎంఎం స్కూల్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరం

తిరుమలగిరి(తుంగతుర్తి): జిల్లాలో రెండో విడత కంటి వెలుగు నిర్వహణకు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. కంటి సమస్యలు ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి, అద్దాలు పంపిణీ చేయనున్నారు. ఇటీవల అన్ని పీహెచ్‌సీలకు పరికరాలు అందజేశారు. గురువారం నుంచి ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. జిల్లాలో 475 గ్రామ పంచాయతీలు, 5 మున్సిపాలిటీల పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. దీనికోసం 50 బృందాలు ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో వైద్యాధికారి ఆప్తాల్మిక్ ఆఫీసర్, సూపర్‌వైజర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఏఎన్‌ఎం, ముగ్గురు ఆశ కార్యకర్తలు ఉంటారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరాలు కొనసాగుతాయి. వంద రోజుల్లో పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు.
డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సహాయ కేంద్రం
జిల్లాకు 87 వేల కంటి అద్దాలు చేరాయి. కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ ,డీఎంహెచ్‌ఓ కోటాచలంలు అధికారులతో ఇటీవల సమీక్ష సమావేశం నిర్వహించి మార్గనిర్దేశనం చేశారు. కంటి వెలుగు పర్యవేక్షణకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సహాయ కేంద్రం ఏర్పాటు చేశారు. జిల్లా వైద్యాధికారి, ప్రోగ్రాం అధికారి, మేనేజర్ ఇక్కడి నుంచి శిబిరాల నిర్వహణ తీరును పర్యవేక్షిస్తారు.

సిబ్బందికి శిక్షణ ఇచ్చాం



కంటి వెలుగుపై ఇప్పటికే అధికారులకు, సిబ్బందికి శిక్షణ ఇచ్చాం. ప్రతి గ్రామంలో ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలతో ప్రచారం చేయించాం. శిబిరాల నిర్వహణ తేదీలను ముందే వెల్లడిస్తాం.
– డాక్టర్ కోటాచలం, జిల్లా వైద్యాధికారి, సూర్యాపేట

అద్దాల పంపిణీ ఇలా..

మొదట దగ్గరి చూపు ఇబ్బంది ఉన్న వారికి రీడింగ్ గ్లాసులు ఇస్తారు. మిగతా వారికి కొలతలు తీసుకొని కంటి అద్దాలు అందజేస్తారు. ఆపరేషన్లు అవసరమైన వారికి ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించి రాష్ట్ర స్థాయిలో నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. పరీక్షలు చేయడానికి అన్ని పీహెచ్‌సీలకు యంత్రాలు, ఔషధాలు పంపించారు.

నేడు కంటి వెలుగును ప్రారంభించేది వీరే..

సూర్యాపేట: జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించేవారి పేర్లను ప్రభుత్వం ప్రకటించింది. గురువారం జిల్లా కేంద్రంలోని కుడకుడ జెడ్పీఉన్నత పాఠశాలలో ఉదయం 9గంటలకు మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి కంటి వెలుగును లాంఛనంగా ప్రారంభించనున్నారు. అలాగే పేట పట్టణంలోని 29 వ వార్డులో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, తుంగతుర్తి మండలం తూర్పుగూడెం గ్రామంలో జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగందర్‌రావు, నాగారం మండల కేంద్రంతో పాటు తొండ గ్రామంలో ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్, కోదాడ మండలం అడ్లూరు లో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, హుజూర్‌నగర్ పట్టణంలోని 4వ వార్డులో గల పద్మశాలి భవన్‌లో ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, సూర్యాపేట పట్టణంలోని 7వ వార్డులో సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ ఉదయం 10.30 గంటలలోపు ప్రారంభించనున్నారు.

క్లుప్తంగా

బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి రూ.లక్ష జరిమానా

తిరుమలగిరి(తుంగతుర్తి): సారా కేసులో బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి రూ.లక్ష జరిమానా విధించినట్లు తుంగతుర్తి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.బాలాజీనాయక్ తెలిపారు. తిరుమలగిరి మండలం తొండ గ్రామానికి చెందిన జలగం దేవయ్య సారా తయారు చేస్తూ పలుమార్లు పట్టుబడ్డాడు. అతడిపై కేసులు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. అయినప్పటికీ బైండోవర్ ఉల్లంఘించినందున రూ.లక్ష జరిమానా విధించడంతో చెల్లించినట్లు తెలిపారు. సారా తయారీ, అమ్మకాలపై ఎవరూ పాల్పడ వద్దని, ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి


బాలయ్య (ఫైల్)

గుండాల : చేపల వేట ఓ వ్యక్తి ప్రాణం తీసింది. ఈ ఘటన మండలంలోని సీతారాంపురం గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాలి బాలయ్య (42) మూడు రోజుల క్రితం గ్రామం పక్కనే ఉన్న వెంకయ్య కుంటకు చేపల వేటకు వెళ్లి నీటిలో మునిగిపోయాడు. అతడిని ఎవరూ చూడకపోవడంతో బుధవారం కుంటలో శవమై తేలాడు. గమనించిన ఇరుగు పొరుగు వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు చెప్పారు. మృతుడికి భార్యతో పాటు కూతురు, కుమారుడు ఉన్నారు. కాగా, ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మృతదేహం ఆచూకీ లభ్యం

చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామం వద్ద ఈనెల 17న లభ్యమైన మృతదేహం ఆచూకీ లభ్యమయ్యింది. మృతుడు పట్టణ కేంద్రంలోని బంగారిగడ్డకాలనీకి చెందిన అబ్దుల్ సత్తార్‌గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ అయిన సత్తార్ మతిస్థిమితం సరిగా లేని కారణంగా ఈనెల 9న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అందులో భాగంగా మంగళవారం లింగోజిగూడెం గ్రామంలో మృతదేహం లభించడంతో సదరు కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు వచ్చి దుస్తులు, ఇతర ఆనవాళ్లను బట్టి సత్తార్‌గా గుర్తించారు. మృతుడి కుమారుడు ఖాదర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సాయుధ పోరాట యోధుడు మృతి


కోట పెద సత్య నారాయణరెడ్డి (ఫైల్)

మోతె : మోతె మండల పరిధిలో బుర్కచర్ల గ్రామానికి చెందిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు కోట పెద సత్య నారాయణరెడ్డి(98) బుధవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందాడు. కమ్యూనిస్టు పార్టీ నాయకుడు కోట పెద సత్యనారాయణరెడ్డి ఎన్నో ప్రజాద్యమాలు చేసి పేద ప్రజలు, రైతాంగానికి అండగా నిలిచారు. భీమిరెడ్డి నర్సింహారెడ్డి, మల్లుస్వరాజ్యం దళాల్లో కోట పెద సత్యనారాయణరెడ్డితో పాటు వీసం సత్యం, కన్నెగంటి సోమయ్య మిలిటెంట్లుగా చేరి ఎన్నో ప్రజా ఉద్యమాలు చేశారు. కోట పెద సత్యనారాయణరెడ్డికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. సత్యనారాయణరెడ్డి పార్థీవ దేహానికి పలువురు నాయకులు, బంధువులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

యాదాద్రీశుడి చెంతకు సీఎంలు


యాదాద్రికి చేరుకున్న హెలికాప్టర్‌లో సీఎం కేసీఆర్, యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్


సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న సీపీ దేవేంద్రసింగ్ చౌహాన్, కలెక్టర్ పమేలా సత్పతి


ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు తిలకం దిద్దుతున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునితామహేందర్‌రెడ్డి


పంజాబ్ సీఎం మాన్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ పమేలా సత్పతి


కేజ్రీవాల్‌కు స్వాగతం పలుకుతున్న అడిషనల్ కలెక్టర్


సీఎంలకు పూర్ణ కుంభ స్వాగతం పలుకుతున్న ఆచార్యులు


శివాలయంలో ధ్వజస్తంభాన్ని మొక్కుతున్న ఎమ్మెల్సీ కవిత

వైస్‌చైర్మన్, నలుగురు పీఏసీఎస్ డైరెక్టర్ల రాజీనామా

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జూలూరు పీఏసీఎస్ వైస్‌చైర్మన్‌తో పాటు నలుగురు డైరెక్టర్లు రాజీనామా చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్, డీసీఓ పరిమళాదేవికి రాజీనామా పత్రాలు అందజేశారు. అనంతరం వైస్‌చైర్మన్ వాకిటి మల్లారెడ్డి, డైరెక్టర్లు బొబ్బల బాలకృష్ణారెడ్డి, గట్టు రాంరెడ్డి, పాటి బుచ్చిరెడ్డి, ఉడుతల జంగయ్య పట్టణ కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. పీఏసీఎస్ చైర్మన్ గత మూడేళ్లుగా జమ ఖర్చులు చూపించడం లేదని, తీర్మానాలు లేకుండా నిధులు డ్రా చేశారని ఆరోపించారు. ఈ విషయమై గతేడాది కలెక్టర్‌తో పాటు డీసీఓకు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. అయితే కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు విచారణ చేసి నిధుల దుర్వినియోగం జరిగిందని రిపోర్ట్ కూడా ఇచ్చారని తెలిపారు. ఎంక్వైరీ రిపోర్టు వచ్చిన తరువాత కూడా చైర్మన్, సీఈఓపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అధికారులను అడిగితే చైర్మన్‌కు మూడు సార్లు షోకాజ్ నోటీసులు ఇచ్చినా స్పందించడం లేదని చెబుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే, స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వాపోయారు. దీంతో ఆవేదన చెంది తమ పదవులకు రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు.

బొర్రాయి పాలెం రేషన్ షాపు సీజ్

త్రిపురారం : సమయ పాలన పాటించడం లేదనే అభియోగం మేరకు మండలంలోని బొర్రాయిపాలెం రేషన్ షాపును అధికారులు సీజ్ చేశారు. డీలర్‌పై 6(ఏ) చట్టం కింద కేసు నమోదు చేశారు. వినియోగదారుల నుంచి అధిక ఫిర్యాదులు వస్తున్నందున అదనపు కలెక్టర్ ఆదేశానుసారం త్రిపురారం మండలంలోని బొర్రాయిపాలెం రేషన్ షాపును బుధవారం తహసీల్దార్ కేసీ ప్రమీల, సివిల్ సప్లయిస్ డీటీ రామకృష్ణారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రికార్డును పరిశీలించారు. ఉండవలసిన స్టాక్ కంటే అదనంగా 5 క్వింటాళ్ల 85 కేజీల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. దీంతో షాప్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసి బొర్రాయి పాలెం రేషన్ షాపును అప్పలమ్మగూడెం రేషన్ డీలర్ షేక్ హుస్సేన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. నివేదికను అదనపు కలెక్టర్‌కు పంపామని, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు అప్పలమ్మగూడెం డీలర్ షాపు డీలర్ నిర్వహించనున్నట్లు తెలిపారు. వీరి వెంట ఆర్ఐ సురేందర్ సింగ్ ఉన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

నిశీధి సినిమా షూటింగ్ ప్రారంభం

బీబీనగర్ : నూతనంగా తెరకెక్కనున్న నిశీధి సినిమా షూటింగ్‌ను ఆ చిత్ర యూనిట్ బీబీనగర్ మండలంలోని మహాదేవ్‌పురంలో ఉన్న అక్కన్న మాదన్న ఆలయంలో బుధవారం ప్రారంభించింది. ఈసందర్భంగా స్థానిక బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోళి పింగళ్‌రెడ్డి, సర్పంచ్ భాగ్యలక్ష్మిశ్రీనివాస్‌లు క్లాప్ కొట్టారు. కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీనివాస్, నిర్మాత రవి, సినీ హీరో ధనుష్, సలోని తదితరులు పాల్గొన్నారు.


క్లాప్ కొడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు

జాతీయ రహదారిపై కొనసాగుతున్న రద్దీ


హైవేపై హైదరాబాద్ వైపు నెలకొన్న వాహనాల రద్దీ

చౌటుప్పల్ : హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై బుధవారం సైతం వాహనాల రద్దీ కొనసాగింది. సంక్రాంతి పండుగ ముగియడంతో స్వగ్రామాల నుంచి హైదరాబాద్, పరిసర ప్రాంతాలకు తిరుగు ప్రయాణమయ్యారు. విజయవాడ మార్గంలో వాహనాలు బారులుదీరాయి. చౌటుప్పల్ మండల పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద సైతం రద్దీ నెలకొంది. మంగళవారం 54,600 వాహనాలు రాకపోకలు సాగించగా.. బుధవారం 50వేల వాహనాలు రాకపోకలు సాగించాయి.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య


శ్రవణ్‌రెడ్డి(ఫైల్)

రామగిరి(నల్లగొండ) : పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన తిప్పర్తి మండలంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పలమ్మగూడేనికి చెందిన వల్లపురెడ్డి గోవర్దన్‌రెడ్డి, జానకమ్మ దంపతుల కుమారుడు వల్లపురెడ్డి శ్రవణ్‌రెడ్డి (25) డిగ్రీ చేసి నల్లగొండలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. మంగళవారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగి పొలం వద్దకు వెళ్లాడు. విషయాన్ని ఫోన్‌లో బంధువులకు తెలియజేశాడు. వెంటనే వారు వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి అతడిని నల్లగొండ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కాగా, శ్రవణ్‌రెడ్డి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మేకలు అపహరణ

నల్లగొండ క్రైం : గుర్తుతెలియని వ్యక్తులు మేకలు చోరీ చేశారు. ఈ ఘటన జిల్లా కేంద్రంలో ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణ శివారులోని గుండ్లపల్లి రోడ్డు వద్ద నివాసం ఉంటున్న సత్తయ్య వ్యవసాయంతో పాటు మేకలు సాదుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. ఇటీవల సంక్రాంతి పర్వదినానికి అతడి మేకల మందలో ఒక దానిని దుండగులు అపహరించుకుపోయారు. అదే విధంగా చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన రైతులవి దాదాపు 30వరకు అపహరించుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, సీసీ కెమెరాలను పరిశీలించగా చోరీ దృశ్యాలు రికార్డయ్యాయని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని వన్‌టౌన్ సీఐ గోపి తెలిపారు.

అడుగడుగునా భారీ బందోబస్తు


ఏసీపీలకు సూచనలు చేస్తున్న సీపీ చౌహాన్

యాదగిరిగుట్ట : సీఎంలు కేసీఆర్, కేజ్రీవాల్, భగవంత్ సింగ్ మాన్, మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ నృసింహుడి దర్శించుకునేందుకు వచ్చిన నేపథ్యంలో రాచకొండ సీపీ దేవేంద్రసింగ్ చౌహాన్ ఆధ్వర్యంలో యాదగిరిగుట్టతో పాటు కొండపై భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 7మంది డీసీపీలు, 12మంది ఏసీపీలు, 30మంది సీఐలు, 54 మంది ఎస్సైలతో పాటు 1050 మంది పోలీస్ సిబ్బంది, సీఎం సెక్యూరిటీ వింగ్, ఎస్‌బీ, ఇంటలిజెన్స్, బీడీ టీమ్‌లతో పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచే యాదాద్రి ఆలయంతో పాటు రింగ్ రోడ్డు, ప్రెసిడెన్షియల్ సూట్, యాదగిరిగుట్ట పట్టణాన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. సీఎం కేసీఆర్‌తో పాటు ఆయా రాష్ట్రాల సీఎంలు వచ్చి వెళ్లేంత వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. రింగ్‌రోడ్డు, ప్రెసిడెన్షియల్ సూట్ ప్రాంతాల్లోకి ఎవరూ వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు.

అప్పుల రాష్ట్రంగా మార్చిన సీఎం కేసీఆర్

- ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీ కోమటిరెడ్డి

ఆలేరురూరల్ : రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో సీఎం కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆలేరు మండలం శారాజీపేట గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేని కేసీఆర్ టీఆర్ఎస్ పార్టీని బీఆర్ఎస్‌గా మార్చి దేశాన్ని ఏలుదాం అనుకోవడం సరైంది కాదన్నారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయలేని కేసీఆర్ దేశాన్ని ఎలా అభివృద్ధి చేస్తారని ఎద్దేవా చేశారు. కొల్లూరు నుంచి మాటూరు గ్రామానికి వెళ్లే దారిలో వాగుపై వంతెన నిర్మించాలని రైతులు, ప్రజలు ఎంపీని కోరారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు ఎంపీని సన్మానించారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, ఎంపీపీ అశోక్, వెంకటేశ్వర్లు, విద్యాసాగర్, ఎంపీటీసీ బత్తుల నరేందర్‌రెడ్డి, నాగరాజు, మధు, ఉప్పలయ్య, శ్రీపాల్‌రెడ్డి, శంకరయ్య, సురేష్, కిష్టయ్య పాల్గొన్నారు.

రైతులకు పట్టాలు ఇవ్వాలని ధర్నా


ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

డిండి: మండల కేంద్రంలో ఇరిగేషన్ పేరు మీదకు మారిన వ్యవసాయ భూముల పట్టాలను రైతులకు ఇవ్వాలని బీజేపీ దేవరకొండ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ ఏటి.కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డిండి పట్టణానికి సంబంధించి దాదాపు 490 ఎకరాల వ్యవసాయ భూమి 2009 సంవత్సరంలో అప్పటి అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇరిగేషన్ పేరు మీదకు మారిందని, వీటిలో 50 సర్వే నంబర్లలోని దాదాపు 210ఎకరాలు పట్టా భూములని స్థానిక రెవెన్యూ అధికారులు ధ్రువీకరించారన్నారు. అర్హులైన రైతులకు పట్టాలు అందజేయడంలో స్థానిక ఎమ్మెల్యే రవీంద్రకుమార్ తమ మొండి వైఖరి వీడాలన్నారు. పట్టాలు పంపిణీ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాధిక, శ్రీనివాసాచారి, జైపాల్, వెంకటయ్య, రమేష్, పురుషోత్తం, రాఘవ, అంజియాదవ్, శ్రీను, సాయిగౌడ్, అమృత్ పాల్గొన్నారు.

మేళ్లచెరువు వాసికి డాక్టరేట్


వంగర శ్రీహరి

మేళ్లచెరువు : మండల కేంద్రానికి చెందిన వంగర శ్రీహరి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం మాట్లాడుతూ సెకండరీ స్కూల్ స్టూడెంట్స్ ప్రవర్తన, వారి ఆరోగ్యం (ఏ స్టడీ ఆన్ హెల్త్ అవైర్‌నెస్ అండ్ హెల్త్ ప్రమోటింగ్ బిహేవియర్ ఎమాంగ్ సెకండరీ స్కూల్ చిల్డ్రెన్స్) అనే అంశంపై సుమారు 320 మంది విద్యార్థులపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ పొందినట్లు తెలిపారు. ఈ నెల 6న ఉస్మానియా విశ్వ విద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

లైంగికదాడి, హత్య కేసులో నిందితుల రిమాండ్

- దేవరకొండ డీఎస్పీ నాగేశ్వర్‌రావు

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద మంగళవారం బాలికపై జరిగిన లైంగిక దాడి, హత్య కేసులో ముగ్గురు నిందితులను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు దేవరకొండ డీఎస్పీ నాగేశ్వర్‌రావు తెలిపారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పెద్దఅడిశర్లపల్లి మండలం వడ్డెరిగూడేనికి చెందిన నిందితులైన వరికుప్పల దిలీప్, వరికుప్పల నరేష్, వరికుప్పల శివలను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వారిని విచారించగా నిందితుల్లో ఒకరైన దిలీప్ హైదరాబాద్‌లో ఉంటున్న బాధిత బాలికతో కొంతకాలంగా స్నేహంగా ఉంటున్నాడని తెలిపారు. సంక్రాంతి సెలవులకు అమ్మమ్మ ఇంటికి వచ్చిన బాలిక తిరుగు ప్రయాణంలో నరేష్ కారు ఎక్కి అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్దకు చేరుకుందని తెలిపారు. అక్కడే రౌడీ బాయ్స్ పేరుతో నిర్వహిస్తున్న వస్త్ర దుకాణంలోకి దిలీప్ బాలికను తీసుకెళ్లి లైంగికదాడి చేశాడని తెలిపారు. ఈ క్రమంలో బాలికకు తీవ్ర రక్తస్రావం జరిగి అపస్మారక స్థితిలోకి వెళ్లిందని, దేవరకొండ ఆస్పత్రికి తరలించగా మృతిచెందిందని తెలిపారు. ఘాతుకానికి ఒడిగట్టిన దిలీప్ ఏ1, నరేశ్ ఏ2, శివపై ఏ3గా కేసు నమోదు చేశామని తెలిపారు. నిందితుల సెల్‌ఫోన్లు, కారును స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచినట్లు డీఎస్పీ వివరించారు.

నిందితులకు శిక్ష పడేలా చూస్తాం

పెద్దఅడిశర్లపల్లి : బాలికపై లైంగిక దాడి హత్య కేసులో నిందితులకు కఠిన శిక్ష పడేలా చూస్తామని దేవరకొండ డీఎస్పీ నాగేశ్వర్‌రావు అన్నారు. బాలికపై అత్యాచారం జరిగిన మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్ వద్ద గల ఘటన స్థలాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసునుకున్నారు. ఆయన వెంట కొండమల్లేపల్లి సీఐ రవీందర్‌రావు, ఎస్ఐ వీరబాబులున్నారు.

న్యాయం జరిగే వరకు పోరాడుతా


మాట్లాడుతున్న వెంకటయ్య

భువనగిరి : కోర్టుల మీద నమ్మకం ఉందని, న్యాయం జరిగే వరకు పోరాడుతానని పరువు హత్యకు గురైన అంబోజు నరేశ్ తండ్రి వెంకటయ్య అన్నారు. సరైన సాక్షాధారాలు లేవని పరువు హత్య కేసును కొట్టివేస్తూ భువనగిరి సెషన్స్ కోర్టు బుధవారం తీర్పు వెలువరించిన నేపథ్యంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తన కొడుకును హత్య చేసింది తుమ్మల శ్రీనివాస్‌రెడ్డేనని ఆరోపించారు. నరేష్, స్వాతిలు ప్రేమించి పెళ్లి చేసుకున్నారని ఆ సమయంలో తను ముంబాయిలో ఉన్నట్లు చెప్పారు. వారి వివాహం విషయం తనకు తెలియదని చెప్పారు. విషయం తెలిసిన తర్వాత పోలీసుల సమక్షంలో శ్రీనివాస్‌రెడ్డికి ఆయన కూతురును అప్పగించామని తెలిపారు. మళ్లీ అమ్మాయి స్వాతి తల్లిదండ్రులను కాదని అబ్బాయి వద్దకు వచ్చిందన్నారు. వారి అమ్మాయిని వారికి అప్పగించినట్లు నరేశ్‌ను తనకు అప్పగిస్తే బాగుండేదన్నారు. పోలీసుల వైఫల్యం కారణంగానే కేసు నీరుగారిందని వాపోయారు. న్యాయం కోసం హైకోర్టును ఆశ్రయిస్తానని తెలిపారు.

పోలీసులు పక్షపాతంతో వ్యవరించడం వల్లే..

– మల్లేశం, అనురాధ, ప్రజా సంఘాల నాయకులు

అంబోజు నరేష్ పరువు హత్య కేసులో పోలీసులు పక్షపాతంతో వ్యవహరించి సరైన సాక్షాధారాలు సేకరించలేదని ప్రజా సంఘాల నాయకులు కల్లూరి మల్లేశం, అనురాధ ఆరోపించారు. నరేశ్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని చెప్పారు. నరేష్, స్వాతి హత్య కేసులో కోర్టు ఇచ్చిన తీర్పును తాము అంగీకరించడం లేదన్నారు.

తప్పుడు కొలతలు!

- పట్టుబడిన ఆర్ స్మార్ట్ సూపర్ స్టోర్
- సీజ్ చేసిన మున్సిపల్ అధికారులు


సీజ్ చేసిన ఆర్ స్మార్ట్ సూపర్‌స్టోర్

భువనగిరిటౌన్ : మున్సిపల్ శాఖ ట్రేడ్ లైసెన్స్ జారీని ఆన్‌లైన్ చేసింది. అంతేకాదు.. దుకాణదారులు స్వయంగా సెల్ఫ్ ట్రేడ్ లైసెన్స్ తీసుకునే విధానం తీసుకువచ్చింది. ఇదే అదునుగా భావించిన కొందరు తప్పుడు కొలతలు చూపి మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇలాంటి సంఘటన భువనగిరిలో వెలుగుచూసింది. పట్టణంలోని సూపర్‌స్టోర్ యజమాన్యం ట్రేడ్ లైసెన్స్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసింది. స్టోర్ విస్తీర్ణం 10వేల చదరపు గజాలు ఉన్నట్లు నమోదు చేసింది. రూ.50 వేల ఫీజు చెల్లించి ఆన్‌లైన్ ద్వారా లైసెన్స్ తీసుకున్నారు. అయితే ప్రతి ఆర్థిక సంవత్సరం ముగింపు సమయంలో నిబంధనల మేరకు ట్రేడ్ లైసెన్స్ కొలతలు ఉన్నాయా.. లేదా అని అధికారులు పరిశీలిస్తారు. ఈ క్రమంలో డిసెంబర్ మొదటి వారంలో అధికారులు సూపర్‌స్టోర్‌ను పరిశీలించగా కొలతల్లో తేడా ఉన్నట్లు తేలింది. మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో మరోసారి కొలతలు వేశారు. స్టోర్ నిర్వాహకులు ఆన్‌లైన్‌లో పేర్కొన్న 10 వేల చదరపు మీటర్లు కాకుండా 12వేల చదరపు మీటర్లు ఉన్నట్లు గుర్తించారు. అదనంగా 2 వేల చదరపు మీటర్లు తక్కువ చూపించినట్లు తేలింది. ఆన్‌లైన్‌లో 12వేల చదరపు మీటర్లు చూపించి రూ.60 వేల ఫీజు చెల్లిస్తే సరిపోయేది. కానీ, తప్పుడు కొలతలు చూపించినందుకు మున్సిపల్ చట్టం ప్రకారం ఫీజుపై 25 సార్లు రెట్టింపు చెల్లించాల్సి ఉంటుంది.

తప్పుగా నమోదు చేస్తే చర్యలు

మున్సిపల్ శాఖ ట్రేడ్ లైసెన్స్ జారీ విధానాన్ని సెల్ఫ్ చేసింది. దుకాణదారులు తమ షాప్ చుట్టూ కొలతలు తీసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. అనంతరం చెల్లించాలిన్న ఫీజు ఆన్‌లైన్‌లో వస్తుంది. కొలతలు తప్పుగా నమోదు చేసినా లైసెన్స్ జారీ అవుతుంది. కానీ, తనిఖీలు చేసినప్పుడు తేడా ఉంటే చెల్లించాల్సిన దానిపై 25 సార్లు రెట్టింపు ఫైన్ ఉంటుంది. స్పందించని పక్షంలో సీజ్ చేస్తాం.

–బి.నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, భువనగిరి

రూ.16 లక్షలు ఫైన్

తప్పుడు కొలతలు చూపిన సూపర్ స్టోర్ యాజమాన్యానికి మున్సిపల్ అధికారులు రూ.16 లక్షలు ఫైన్ వేశారు. ఇందుకు సంబంధించి డిసెంబర్ 23న నోటీసుల జారీ చేశారు. నోటీసు జారీ చేసిన తరువాత 15 రోజుల్లో ఫైన్ చెల్లించాలి. కానీ, స్టోర్ నిర్వాహకులు స్పందించకపోవడంతో జనవరి 4న మరోసారి నోటీసులు జారీ చేశారు. అయినా ఖాతరు చేయకపోవడంతో మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు అధికారులు స్టోర్‌ను బుధవారం సీజ్ చేశారు.

యాదాద్రీశుడికి లక్ష పుష్పార్చన


లక్ష పుష్పార్చనలో వైటీడీఏ వైస్ చైర్మన్, ఈఓ

యాదగిరిగుట్ట : ఏకాదశిని పురస్కరించుకొని బుధవారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో లక్ష పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో శ్రీస్వామి, అమ్మవార్లను బంగారు సింహాసనంపై అధిష్టింపజేసి, వివిధ రకాల లక్ష పుష్పాలు, తులసీ పత్రాలతో అర్చన గావించారు. ఈ వేడుకలో వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు, ఆలయ ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, అధికారులు పాల్గొన్నారు. అదే విధంగా ప్రధానాలయంలో నిత్యకల్యాణం, సుదర్శన హోమం, గజవాహన సేవ, ఇతర పూజలు అంతరంగికంగా చేపట్టారు.

పోలీసు బందోబస్తు పరిశీలన

సూర్యాపేట రూరల్ : సూర్యాపేట రూరల్ పరిధిలోని జాతీయ రహదారి రాయినిగూడెం జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తును ఎస్పీ రాజేంద్రప్రసాద్ పరిశీలించారు. బుధవారం ఖమ్మంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ బహిరంగ సభ నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ టూర్ సందర్భంగా జిల్లాలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వాహనాల మళ్లింపు లాంటి ముందస్తు చర్యలతో రోడ్లపై ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ ఇబ్బందులు లేకుండా చేసినట్లు పేర్కొన్నారు. ఖమ్మం వైపు వెళ్లే అన్ని మార్గాల్లో కోదాడ, సూర్యాపేట, హుజూర్‌నగర్, 365 జాతీయ రహదారిపై అప్రమత్తం చేసినట్లు చెప్పారు. కోదాడ, సూర్యాపేట పట్టణాల్లో జాతీయ రహదారులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించినట్లు తెలిపారు. ఆయన వెంట డీఎస్పీ నాగభూషణం, ఎస్ఐ సాయిరాం తదితరులు ఉన్నారు.

సమయ పాలన పాటించండి

- జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి


మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ

యాదగిరిగుట్ట రూరల్ : అంగన్‌వాడీ టీచర్లు విధిగా సమయపాలన పాటించాలని జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి ఆదేశించారు. బుధవారం ఎంపీపీ చీర శ్రీశైలం అధ్యక్షతన జరిగిన యాదగిరిగుట్ట మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రాలకు వచ్చే చిన్నపిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పౌష్టికాహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీఆర్‌డీఓ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ పింఛన్ ఆగిపోయిన వారికి అర్హతలుంటే మళ్లీ వస్తుందని, ఆందోళన చెందవద్దన్నారు.

సమస్యలు ఏకరువుపెట్టిన సర్పంచ్‌లు

మన ఊరు – మన బడి పనులు పెండింగ్‌లో ఉన్నాయని, రైతులకు విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని పలువురు సర్పంచ్‌లు అధికారుల దృష్టికి తీసుకురాగా పరిష్కరిస్తామని వివరణ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అనురాధ, ఎంపీడీఓ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీఓ చంద్రశేఖర్, వైఎస్ ఎంపీపీ ననబోలు ప్రసన్న, సర్పంచ్‌లు తోటకూరి బీరయ్య, సువర్ణ, యాదయ్య, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.